

నూకాంబికను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు కొణతాల, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద, తదితరులు





ఢిల్లీ డబుల్ ధమాకా

వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలుపు

సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై సునాయాస విజయం

డుప్లెసిస్
50 (27)

5 వికెట్లు తీసిన మిచెల్ స్టార్క్

- ఐదు వికెట్లను పడగొట్టిన మిచెల్ స్టార్క్
- హాఫ్ సెంచరీతో మెరిసిన డుప్లెసిస్
- ఎస్‌ఆర్‌హెచ్ బ్యాట్స్‌మన్ అనికేత్ వర్మ ఒంటరి పోరు వృథా

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):
అతిథ్య జట్టుకు అనుకూలించే ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు మ్యాచ్‌లకు ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో పటిష్ఠమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన బౌలర్ మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగే బంతులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఈ క్రమంలో ఐదు వికెట్ల ఘనతను సాధించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు డుప్లెసిస్ వేగవంతమైన హాఫ్ సెంచరీ (50; 3 సిక్సర్లు, 3 బౌండరీలు), మెక్‌గుర్క్ (38; 4 ఫోర్లు, 2 సిక్సర్ల)తోపాటు అభిషేక్ పోరల్ (34 నాటౌట్; (2 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టుకు సునాయాస విజయాన్నందించారు. అయితే భారీ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియం హోరెత్తుతుందని ఆశించిన ప్రేక్షకులకు ఆదివారం అసలైన ఐపీఎల్ మజా అందలేదు. అడపాదడపా కనువిందు చేసే షాట్స్ మినహా రెండు జట్ల ఇన్నింగ్స్‌లో భారీ సిక్సర్లు, బౌండరీల జోరు కనిపించలేదు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, కేరింతల మధ్య బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో అనికేత్ వర్మ(74) క్రీజులో ఉన్నంత సేపు ఐపీఎల్ మజాను ఆస్వాదించారు. అతడు అవుటైన తర్వాత స్టేడియం అంతా నిశ్శబ్దంగా మారిపోయింది. మూడు ఓవర్లలో 29 పరుగులకు మూడు వికెట్లు, పది ఓవర్లలో 105 పరుగులకు నాలుగు వికెట్లు, 16 ఓవర్లలో 149 పరుగులకు ఎనిమిది వికెట్లు, 18.4 ఓవర్లకు 163 పరుగులకు ఆలౌట్.. ఇదీ టైటిల్ ఫేవరెట్‌లో ఒకటైన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ కొనసాగిన తీరు. సీజన్ ప్రారంభ మ్యాచ్‌లో జోరు చూపించిన ఈ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పేలవమైన బ్యాటింగ్‌తో తక్కువ స్కోరుకే ఆలౌటైంది. సాధారణ లక్ష్యాన్ని ... మిగతా 6వ పేజీలో



అనికేత్ వర్మ
74 (41)



మ్యాచ్‌ను వీక్షిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్, ఐసీసీ చైర్మన్ జై షా



నూకాంబికకు నీరాజనం

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో భాగంగా వేకువజాము ఐదు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు ఉన్నారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

నేడు మంత్రి లోకేశ్ పర్యటన

- అచ్యుతాపురంలో రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఎలమంచిలి నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ



విశాఖ విమానాశ్రయంలో ఆదివారం మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద. చిత్రంలో బత్తుల తాతయ్యబాబు, పీవీజీఆర్ కుమార్

అనకాపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం నోవాటెల్ హోటల్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు అచ్యుతాపురంలోని లేపాక్షి కల్యాణ మండపానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు విశ్రాంతి, భోజన విరామం. అనంతరం లేపాక్షి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన టీడీపీ కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.14 (సోమవారం సాయంత్రం)



వైభవంగా ఉగాది వేడుకలు

పంచాంగ శ్రవణంలో పాల్గొన్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ, తదితరులు

స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక జగన్నాథస్వామి ఆలయ పండితులు బంకుపల్లి సత్యనారాయణ పంచాంగ శ్రవణం గావించారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

టీచర్ల బదిలీలపై కసరత్తు

కొత్త చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఈ విద్యా సంవత్సరం నుంచి పారదర్శకంగా అమలుకు శ్రీకారం
- టీచర్ల సీనియారిటీ జాబితా సేకరణ
- స్వాగతించిన ఉపాధ్యాయ సంఘాలు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
విద్యారంగంలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యారంగం బలోపేతానికి అనేక సంస్కరణలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రభుత్వం రూపొందించిన బదిలీల నియంత్రణ చట్టం-2025 మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో టీచర్ల బదిలీలకు జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది.

జిల్లాలో వివిధ హోదాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 6,800 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కొత్త చట్టం ప్రకారం ఈ ఏడాది బదిలీలు చేపట్టేందుకు ఇప్పటికే సీనియారిటీ జాబితా సిద్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో జిల్లా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. సీనియారిటీ జాబితా రూపొందించేందుకు వివిధ కేడర్ ఉపాధ్యాయులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ముందుగా జిల్లాలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను రూపొందించి లోపాలను సరిదిద్దనున్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బదిలీల ప్రక్రియను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నోడల్ విద్యాశాఖాధికారి నిర్వహించనున్నారు.

చట్టం అమలుకు ఆమోద ముద్ర

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం- 2025 ముసాయిదా సిద్ధం చేసి ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి, ఇటీవల శాసన సభలో చట్టం అమలుకు ఆమోద ముద్ర వేసింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విద్యాశాఖ నిర్వీర్యం అయిందని, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను అస్తవ్యస్తంగా చేసిందని ఆరోపణలు ఉన్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో డైరెక్ట్ ట్రాన్స్‌ఫర్స్ పేరుతో ఉపాధ్యాయుల బదిలీలు చేసేవారు. సాధారణ బదిలీల కౌన్సెలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల ఆధారంగా బదిలీలు జరిగేవి. ఇటువంటి అస్తవ్యస్త పరిస్థితులకు రాష్ట్ర ... మిగతా 6వ పేజీలో

చట్టం చేయడం శుభపరిణామం



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం శాశ్వత చట్టం చేయడం శుభపరిణామం. ప్రతి ఏడాది ఒకే సమయంలో బదిలీలు, పదోన్నతులు చేపట్టడం మంచి ఆలోచన. అయితే కొత్త చట్టం అమలు మార్గదర్శకాల ప్రకారం బ్లైండ్ టీచర్లు ఒకే పాఠశాలలో ఎన్ని రోజులైనా పనిచేసే అవకాశాన్ని కోల్పోతారు. అదే విధంగా చట్టపరంగా భర్త నుంచి విడిపోయిన మహిళా టీచర్లు ఒకేచోట పనిచేసే అవకాశాన్ని కోల్పోతారు. ప్రభుత్వం ఈ రెండు అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

- గొంది చిన్నబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ గడువు పెంపు

ఏప్రిల్ 30 వరకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం

- ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ తప్పనిసరి
- దూర ప్రాంతాల్లో ఉన్న వారిని రప్పించి ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్‌డీటీలకు ఆదేశాలు



ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ

నర్సీపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):
రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవడానికి ప్రభుత్వం నెల రోజులు గడువు పెంచింది. లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని తొలుత ప్రకటించింది. రేషన్ లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోకపోవడంతో ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ లోగా ప్రక్రియ పూర్తి చేయించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, సీఎస్‌ఆర్‌ఐలకు ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో 14,99,160 మంది లబ్ధిదారులు ఉంటే 13,55,353 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 1,43,807 మంది చేయించుకోవాల్సి ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు కీలకం కాబట్టి ఈకేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులకు రేషన్ సరకులతో పాటు భవిష్యత్తులో మిగిలిన అన్ని పథకాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్‌రాయవరం మండలాల సీఎస్‌డీటీ పరిధిలో 26,080 మంది ఈకేవైసీ చేయించుకోవాలి. నర్సీపట్నం, గొలుగొండ సీఎస్‌డీటీ పరిధిలో 12.126, నాతవరం, రోలుగుంట, కోటవురట్ల మండలాల పరిధిలో 13,121, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల పరిధిలో 10,624, ఎలమంచిలి, రాంబిల్లి, కశింకోట మండలాల పరిధిలో 16,110, మాడుగుల, మాకవరపాలెం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో 23,335, అచ్యుతాపురం, మునగపాక, పరవాడ మండలాల పరిధిలో 17,291, అనకాపల్లి, సబ్బవరం, చోడవరం సీఎస్‌డీటీ పరిధిలో 25,100 మంది ఈకేవైసీ చేయించుకోవలసి ఉంది. ఏప్రిల్ 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఊర్లో అందుబాటులో లేని వారికి సమాచారం అందజేసి ఈకేవైసీ ... మిగతా 6వ పేజీలో

పేటలో చిలకల తీర్థం సందడి

- పోటెత్తిన భక్తజనం
- మంగవరం రోడ్డు, మెయిన్‌రోడ్డు కిటకిట



రద్దీగా ఉన్న మంగవరం రోడ్డు

పాయకరావుపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి):
ఉగాదిని పురస్కరించుకుని పాయకరావుపేటలో ఆదివారం చిలకల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మంగవరం రోడ్డులోని పేరంటాలమ్మ గుడిలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం చిలకల తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలు కొనుగోలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఈ తీర్థానికి పాయకరావుపేట, తుని పట్టణాలతో పాటు పరిసర సుమారు 30 గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో పట్టణంలోని మంగవరం రోడ్డుతో పాటు మెయిన్‌రోడ్డులో చిత్ర మందిర్ థియేటర్ నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు జనంతో నిండిపోయాయి. రోడ్డుకు ఇరు వైపులా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన ... మిగతా 6వ పేజీలో



పేరంటాలమ్మ గుడి వద్ద కిక్కిరిసిన జనం

మంత్రి లోకేశ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



అచ్యుతాపురం జంక్షన్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ఆదివారం అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. శంకు స్థాపన సమయంలో ట్రాఫిక్‌కి అంతరాయం కలుగకుండా తీసుకోవలసిన చర్యలపై సీఐ నమ్మి గణేశ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో సుందరపు సతీశ్ కుమార్, భైలపూడి శ్రీరామ దాసు, జనపరెడ్డి శ్రీనివాస రావు, డ్రీమ్స్ నాయుడు పాల్గొన్నారు.

భావనా రుషీశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం

రాంబిల్లి: మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీలల ఆరాధ్యదైవం శ్రీ బృగు మహర్షి నం దనుడు శ్రీ భద్రావతి సమేత భావనా రుషీశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు కొత్తపేట గ్రామంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కొత్తపేట పద్మశాలి సంఘం ఆలయ కమిటీ నిర్వాహకులు మాడెం రాజుబాబు, మాడెం నాగేశ్వరావు, వానపల్లి అరుణత జగాన్నాథ్, తేలు వెంకటేశ్వర్రావు, తెడ్లపు అప్పలకొండ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి 10 గంటలకు స్వామివారికి పత్రిమహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి దంపతులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం నిర్వహించనున్న కల్యాణ ఉత్సవానికి జిల్లా నలుమూలలకు నుంచి భక్తులు హాజరు కానున్నారు.

అట్టహాసంగా గుర్రాల పరుగు పోటీ



విజేతకు బహుమతి అందజేస్తున్న నేతలు

ఎలమంచిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కరించుకుని మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో ఆదివారం జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో నిర్వహించిన ఈ పోటీలను స్థానిక జనసేన, టీడీపీ పార్టీల నేతలు కర్రి జాన్సీ, యల్లపు గోపీ పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలలు నుంచి సుమారు 10 గుర్రపు జట్లు పాల్గొన్నాయి. సుమారు రెండున్నర గంటలు పాటు జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. పరిసర గ్రామాల ప్రజలు వీక్షించారు. పోటీల్లో ప్రథమ విజేతగా చోడవరం మండలం ఆర్ఆర్.పేటకు చెందిన దాడి నూక హనుమంతురావు, ద్వితీయ స్థానంలో అగ్రహారంనకు చెందిన మణి, తృతీయ స్థానం రామన్నపాలెంకు చెందిన చోటమాంబిక(విక్రమ్)ల గుర్రాలు గెలుపొందినట్లు ప్రకటించారు. విజేతలకు నగదు బహుమతులను జనసేన పార్టీ నేత కర్రి ఝాన్సీ, టీడీపీ నేత యల్లపు గోపీ ద్వారా అందజేశారు. స్థానికులు వెంకట్, స్వామి పాల్గొన్నారు.

ఇంటింటా.. ఉగాది సంబరం



మాట్లాడుతున్న బ్రాన్‌డిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి

రాంబిల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ ఎలమంచిలి ఖండ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఉగాది ప్రాముఖ్యతను వివరించారు. ఆర్‌ఎస్ఎస్ విభాగ శారీరక ప్రముఖ్ మంతా సుబ్బారావు మాట్లాడుతూ సంఘ్ లక్ష్యాలు, సంఘ విలువలు, సమాజ నిర్మాణంలో స్వయం సేవకుల పాత్ర ను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఎలమంచిలి ఖండ నిర్వాహక చింతకాయల రాజు, సంఘ నాయకులు, స్వయం సేకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవ రాట వేడుక

మునగపాక: స్థానిక గ్రామ పంచాయతీవీధిలో రామాలయం ఆవరణలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవ ఉత్సవ రాట కార్య క్రమం నిర్వహించారు. అర్చకుడు రేజేటి సత్యనారాయణాచార్యులు (నాని) పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 6వ తేదీన జరగనున్న శ్రీరామ నవమి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆడారి లక్ష్మణరావు, భక్తులు బొడ్డేడ ప్రసాద్, కిష్టప్ప, పొలిమేర కృష్ణ, వేగి పరదేశినాయుడు, ఆడారి కాశిబాబు, వెలగా రామకృష్ణ, బూడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

ఎలమంచిలి: ఎలమంచిలి కొత్తపేటలోని పురాతన సీతారాముల ఆలయ ఆవరణలో ఆదివారం 9.28 నిమిషాలకు శ్రీరామనవమి పెండ్లి రాట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తుల సమక్షంలో పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ దంపతులు పిల్లా త్రినాథ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు లంకరాజు తదితరుల సమక్షంలో స్వామి వారి పెండ్లిరాట వేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ నూకన్న తదితరులు

రాంబిల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మత్స్యకార గ్రామం కొత్తపట్నంలో 50 కుటుంబాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఆది వారం దిమిలి గ్రామంలో టీడీపీ మాజీ ఎంపీ పప్పల చలపతిరావు సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ మాజీ సర్పంచ్ చెల్లూరి నూకన్న, గ్రామ నాయకులు మేరిగి అప్పలరాజు, గరికిన ఎర్రయ్య, వార్డు సభ్యులు చింతకాయల గాలిరాజు తదితరులకు చలపతిరావు కండువా వేసి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ, నాయకులుఉమ్మిడి నాగేష్, యజ్జల జోగిరాజు,ఉమ్మిడి అప్పలరాజు,గనగళ్ల అప్పన్న,కుందాల రాజారావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ

ఎలమంచిలి: యర్రవరంలో ఆదివారం స్థానిక నేత కరణం రవి, వార్డు ఇన్‌చార్జి తులసీరామ్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సేనాపతి రాజా, మహేశ్, శ్రీనివాసరావు, కె. రవికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎలమంచిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. ఆదివారం ఉగాది పురస్కరించుకుని కొక్కిరాపల్లిలో స్థానికులు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటిన మొక్కలను సంరక్షిస్తామని యువత ప్రతిజ్ఞ చేశారు. .

సమస్యలపై మత్స్యకారుల ఆందోళన

అచ్యుతాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మత్స్యకారులు ఆదివారం పూడిమడక తీరంలో ఆందోళన చేశారు. ఈ ఏడాది వేట నిషేధ సమయంలో పరిహారం వెంటనే మంజూరు చేయాలని కోరారు పూడిమడక హార్బర్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. గతంలో బ్రాండిక్స్ కర్మాగారంలో ఒప్పందం ప్రకారం సుమారు 500 మందికి ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సోమవారం అచ్యుతాపురం వస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్టు వీరు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చేపల తాతలు, సోముడు, చేపల దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లారమ్మ జాతర

అచ్యుతాపురం రూరల్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల అందలాపల్లిలో యల్లారమ్మ పేరంటాల జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

'పాస్టర్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి'



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

పాయకరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం ప్రమాదవశాత్తూ జరగలేదని, ఇది కచ్చితంగా ఉద్దేశపూర్వకంగా ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్య అని ఆరోపించారు. పోలీసుల నేతృత్వంలో జరిగే విచారణతో న్యాయం జరగదని, హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత జ్యుడిషియల్ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీబీపీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, రాష్ట్ర నాయకురాలు అన్నపూర్ణ, మాలమహానాడు నియోజక వర్గ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



'పేట' పాండురంగ ఆలయంలో పంచాంగ శ్రవణం



ఉపమాక ఆస్థాన మండపంలో స్వామివారికి పూజలు

పాయకరావుపేట/నక్కపల్లి/ఎస్.రాయవరం/కోటవురట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పాయకరావుపేట పాండరంగ ఆలయంతో పాటు మంగవరం రోడ్డులోని సీతారామాలయం, రాజుగారిబీడు వెంకటేశ్వరస్వామి ఆలయం, బృందావనం దుర్గాలమ్మ చెట్టు ఆలయం, సాయినగర్‌లోని షిర్డీసాయి ఆలయం, దుర్గానగర్‌లోని కనక దుర్గమ్మ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తలు దర్శించుకున్నారు.

నక్కపల్లి మండలంలోని ఉపమాక క్షేత్రం ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులో కిక్కిరిసిపోయింది. భక్తుల గోత్ర నామాలతో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పూజలు జరిపారు. కొండపై ఉన్న ఆలయంలో స్వామి నిజరూపాన్ని, కింద ఆలయంలో కల్యాణ వేంకటేశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పంచాంగ శ్రవణం జరిపారు.

కోటవురట్ల మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఎస్.రాయవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకను ప్రజలంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలతో వెళ్లి దర్శించుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ధర్మవరం అగ్రహారం సర్పంచ్ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం దంపతులు రైతుల పట్ల వారికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. సర్పంచ్ దంపతులు గ్రామంలో ఎక్కువ శాతం వ్యవసాయం చేసిన వారిని గుర్తించి ఉత్తమ రైతులుగా సన్మానించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, టీడీపీ మండల యువత అధ్య క్షుడు సుంకర శ్రీనివాసరావు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బంగారి, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దార్లపూడి వెంకన్న ఆలయంలో లక్ష మల్లెల పూజలు

లక్ష మల్లెలతో వెంకన్నకు పూజ

ఎస్.రాయవరం : మండలంలోని దార్లపూడి షుగర్ ఫ్యాక్టరీ వద్ద కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష మల్లెలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి పవన్‌కుమార్ ఆచార్యులు, పి.గిరిబాబు ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై కన్నులారా వీక్షించి తరించారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో లక్ష మల్లెలతో పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు అన్నదమ్ములను రక్షించిన పోలీసులు



ప్రమాదం నుంచి బయటపడిన వారితో మెరైన పోలీసులు

ఎస్.రాయవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవు పోలవరం సముద్రతీరంలో మునుగుతుండగా ప్రమాదవశాత్తు కొట్టుకుపోతున్న ఇద్దరి వ్యక్తులను ఆదివారం మెరైన్ పోలీసులు రక్షించారు. ఇందుకు సంబధించి మెరైన్ ఏఎస్ఐ ఎం.రామకృష్ణ కథనం ప్రకారం వివరాలివి. ఉగాదితో పాటు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి తీరానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇందులో భాగంగానే నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం గ్రామం నుంచి బర్ల గోపి, బర్ల బాలు అనే అన్నదమ్ములిద్దరూ సుమారు ఇరవై మంది బంధువులతో కలిసి సాయంత్రం ఇక్కడికి విచ్చేశారు. వారంతా సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా పెద్దగా వచ్చిన అలల తాకిడికి బాలు, గోపి అనే ఇద్దరు అన్నదమ్ములు ప్రమాదవశాత్తే కొట్టుకుపోతుండగా అక్కడే బీట్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది వీరిని గుర్తించి రక్షించారు. దీంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. బంధవులంతా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మెరైన్ సీఐ మురళీరావు సిబ్బందిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎస్. రాయవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐతో పాటు క్షతగాత్రుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన చొప్పా శ్రీను తన భార్యా పిల్లలతో ఇదే మండలం గుడివాడలో నివాసముంటున్నాడు. ఇతడు బైక్‌పై తన స్వగ్రామం వెళ్లి తిగిరి గుడివాడ వస్తుండగా, అడ్డరోడ్డు దాటిన తరువాత వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తుని, ఆ తరువాత అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం వైద్యులు సాయంత్రం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే బాగుంటుంది

» అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పక్కన ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు శాసన సభకు వస్తే బాగుంటుందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం అనకాపల్లిలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికైన సభ్యులంతా ఆయా నియోజకవర్గాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తే బాగుంటుందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోవడం వారికి ఓటు వేసిన ప్రజల దురదృష్టమన్నారు. అసెంబ్లీ పని దినాలు 24 రోజులు పెంచామన్నారు. ప్రజా సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించకుండా సభ్యులు సంతకాలు పెట్టి వెళ్లిపోవడం సరికాదన్నారు. లాబీల్లో కాకుండా సభలో పాల్గొంటే బాగుంటుందన్నారు. అది గౌరవ సభ అని, ఎవరినీ అవమానించడం జరగదన్నారు. వైసీపీ సభ్యులంతా సభకు వస్తారని భావిస్తున్నామన్నారు. సంప్రదాయం ప్రకారం ప్రతిపక్ష హోదా వైఎస్ జగన్‌కు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విశాఖ పశ్చి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ మన రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతి పెద్దదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎంపీ పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, ఇటీవల ఎంపీ కృష్ణదేవరాయలు కూడా హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా చొరవ చూపాలన్నారు. సమావేశంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

ఢిల్లీ డబుల్ ధమాకా

... 5వ పేజీ తరువాయి

ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి వరుసగా రెండో విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి ఓవర్‌లోనే రనౌట్ అయ్యాడు. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఇషాన్ కిషన్(2) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేదు. అతడి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన లోకల్‌బాయ్ నితీష్‌కుమార్ రెడ్డి కేవలం రెండు బంతులను ఎదుర్కొని చెత్త షాట్‌తో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరాడు. వ్యక్తిగత ఎనిమిది పరుగుల వద్ద అక్షర పటేల్ బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న అనికేత్ వర్మ ఆ తరువాత చెలరేగి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. కేవలం 34 బంతుల్లో నాలుగు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ(50) పూర్తిచేసిన అనికేత్‌వర్మకు క్లాసిన్ (32) తోడవడంతో ఎస్ఆర్‌హెచ్ శిబిరం ఊపిరిపీల్చుకుంది. జోరుమీదున్న అనికేత్ వర్మ(74) కులదీప్ యాదవ్ బౌలింగ్‌లో మెక్‌గుర్క్ పట్టిన అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. తర్వాత స్థానాలో దిగిన బ్యాట్స్‌మన్లను మిచెల్ స్టార్క్ వరుసగా పెవిలియన్ దారి పట్టించాడు. సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్ మెక్ గుర్క్ (38) సమయస్ఫూర్తితో ఆడగా, మరో ఓపెనర్ డుప్లెసిస్ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించాడు. అర్ధ సెంచరీ చేసిన డుప్లెసిస్ అన్సారీ బౌలింగ్‌లో తొలి వికెట్‌గా అవుటవ్వగా తర్వాత స్థానంలో దిగిన అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) ఎస్ఆర్‌హెచ్ బౌలర్లను చెండాడి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఈ మ్యాచ్‌లో జట్టులో చేరిన కేఎల్ రాహుల్ (15) అన్సారీ బౌలింగ్‌లో మూడో వికెట్‌గా పెవిలియన్‌కు చేరగా, రాహుల్ స్థానంలో వచ్చిన స్టబ్స్ (21 నాటౌట్, 3 ఫోర్లతో) మ్యాచ్‌ను ముగించాడు.

పేటలో చిలకల తీర్థం సందడి

... 5వ పేజీ తరువాయి

పంచదార చిలకలు, రంగుల చేటలు, ఆట వస్తువులు, తినుబండారాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. తీర్థం సందర్భంగా పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పాయకరావుపేట, నక్కపల్లి సీఐలు జి.అప్పన్న, రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలతోపాటు సుమారు 80 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఈకేవైసీ గడువు పెంపు

... 5వ పేజీ తరువాయి

చేయించాలని సీఎస్‌డీటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ తప్పనిసరి

రేషన్ కార్డు లబ్ధిదారుల్లో ఐదేళ్లు నిండిన పిల్లల దగ్గర నుంచి ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకోవల్సి ఉంది. ఐదేళ్లు దాటిన పిల్లల బయోమెట్రిక్ పడకపోతే ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేయించుకొని డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.

నేడు మంత్రి లోకేశ్ పర్యటన

... 5వ పేజీ తరువాయి

ముందు వరుసలో నిలిచిన కార్యకర్తలతో లోకేశ్ భేటీ అవుతారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు రూ.246 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఫ్లైఓవర్, రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అచ్యుతాపురంలోని మోసయ్యపేట కూడలిలో ఫ్లైఓవర్ పనులు, అనకాపల్లి వరకు సుమారు 13.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డు పనులకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో ఆయన బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

టీచర్ల బదిలీలపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం చెక్ పెడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం -2025 రూపొందించి అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఉపాధ్యాయుల బదిలీల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ప్రతి ఏడాది మే నెల 31 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేసి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టేలా చట్టాన్ని రూపొందించారు. కొత్త చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

4న నీలగిరి చెట్లకు వేలం

కృష్ణాదేవిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం జడ్పీ హై స్కూల్ ఆవరణలో గల నీలగిరి చెట్లను నరికివేసేందుకు ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు పాఠశాలలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం వి.నాగభూషణం తెలిపారు. జడ్పీ సీఈవో ఆదేశాల మేరకు ప్రభుత్వం రూ.1,09,912 ధరను నిర్ణయించిందన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు 85 శాతం నగదు రూ.93,500ను ధరావత్తుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8008704259 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా నూకాలమ్మ పండగ



మాకవరపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెం శివారు దాలింపేట గ్రామంలో ఆదివారం నూకాలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది పర్వదినాన గ్రామంలో నూకాంబిక పండగను నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని దర్శించేందుకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివాచ్చరు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధనను చేపట్టారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆలయానికి మైక్ సెట్ వితరణ

గొలుగొండ మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడు చెరువు వద్ద గల గంగాదేవి ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేల విలువైన మైక్ సెట్‌ను మేడిశెట్టి చంటి ఆదివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో స్థానికుడు శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు దుస్తుల పంపిణీ

కృష్ణాదేవిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వీరబ్రహేంద్రస్వామి ఆలయం వద్ద ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన సుమారు 150 మంది ఆలయ అర్చకులకు దుస్తులు పంపిణీ చేశారు. దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి డీవీడీ ప్రసాద్ అర్చకులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు తామరపల్లి శివ, బాబూరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిస్తేనే పండగ

- ఎవరూ సహకరించకుంటే పండగల పద్ధతులను మార్చుకోవడం తప్పు కాదు
- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిస్తేనే పండగ అవుతుంది... అందరి సహకారం లేకపోతే గ్రామ దేవతల పండగలు నిర్వహించడం కష్టమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు అన్నారు. ఈ క్రమంలో పండగల పద్ధతులను మార్చుకోవడంలో తప్పు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఉగాది సందర్భంగా ఆదివారం ఆయన స్వగ్రామంలో పంచాంగ శ్రవణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నూకాలమ్మ పండగ సందర్భంగా మూడు జాగారాలు నిర్వహించుకుంటామన్నారు. స్థానిక హరిజనవాడ నుంచి ఘటాలను తమ ఇంటి వద్దకు తీసుకువచ్చి, ఇక్కడ నుంచి ఊరంతా తిప్పడం జరుగుతుందన్నారు. అయితే ఊరేగింపులో చివరి వరకు ఎవరూ ఉండకపోవడం శోచనీయమన్నారు. మరిడితల్లి ఉత్సవాలకు తొమ్మిది జాగారాలు ఉంటాయని, జాగారంలో ఘటాల వెనక జనం లేకపోతే బాగోదని.. అందరం కలిసి వస్తేనే పండగ అవుతుందని పేర్కొన్నారు. ఘటాలను ఊరంతా తిప్పడం ఆపివేయడం మంచిదనిపిస్తుందన్నారు. ఘటాలను హరిజనవాడల్లో కాకుండా ఆలయంలోనే ఉంచి పండగ రోజు బయటకు తీస్తే సరిపోతుందని, ఎవరూ సహకరించకపోతే పండగల పద్ధతులను మార్చుకోవడంలో తప్పు లేదని పేర్కొన్నారు. నూకాలమ్మ ఆలయంలో కొత్తగా పెట్టిన విగ్రహం చాలా చిన్నదిగా ఉందని, అందువల్ల ఆ స్థానంలో పెద్ద విగ్రహాన్ని పెట్టాలని నిర్ణయించుకున్నామని అయ్యన్నపాత్రుడు అన్నారు. అలాగే ఆలయం గోపురం దగ్గర ఖాళీ ఉంచకుండా శ్లాబ్ వేశారన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ మంత్రిని రూ.50 లక్షలు మంజూరు చేయాలని కోరామన్నారు. శ్రీసత్యనారాయణస్వామి గోపురంపూ కలశ పునః ప్రతిష్ఠను ఏప్రిల్ 12న నిర్వహించాలని అన్నవరం దేవస్థానం అధికారులు నిర్ణయించారన్నారు. అలాగే అయ్యప్ప స్వామి ఆలయంలోని స్వామివారి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయించామని, తిరుపతిలో కొత్తది తయారు చేయిస్తున్నామని, మే 8న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం నూకాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను చింతకాయల విజయ్ సత్కరించారు.

వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా

- తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కాలువల కోసం తవ్వకాలు జరపడంతో పైపు లైన్లు పగిలిపోవడమే కారణమని ఆవేదన
- ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

మాకవరపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాకవరపాలెం కొత్తవీధిలో వారం రోజులుగా కొళాయిల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వీధిలో డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో తాగునీటి పైపు లైన్లు పూర్తిగా పగిలిపోయాయి. దీంతో కొళాయిల నుంచి నీరు రావడం లేదని ప్రజలు చెబుతున్నారు. దీనిపై ఎంపీడీవోకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా కొళాయిల నుంచి నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రతకు తోడు తాగునీటి సమస్యతో తాము నానాపాట్లు పడుతున్నామని వాపోతున్నారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయినా పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పక్క వీధి నుంచి నీటికి తెచ్చుకోవాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి కొళాయిల నుంచి నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



కొత్తవీధిలో నీరు రాని కొళాయి



బాల వినాయకుడిని దర్శించేందుకు బారులుతీరిన భక్తులు

ఘనంగా ఉగాది వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నర్సీపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వవసు నామ ఉగాది వేడకలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నర్సీపట్నంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, బాలవినాయకుడు, సాయిబాబా, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, నూకాలమ్మ, మరిడి మహాలక్ష్మి, పెదబొడ్డేపల్లి శివాలయం, బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయాలకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా ఉగాది పర్వదినాన వినాయకుడికి పూజ చేస్తే మంచిదని విస్తృత ప్రచారం జరగడంతో ఐదు రోడ్ల కూడలి వద్దనున్న బాల వినాయకుడు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు గంటల తరబడి క్యూ లైన్లలో వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు.



చామంతిపురంలో డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

చురుగ్గా సాగుతున్న డ్రైనేజీ పనులు

మాకవరపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామంతిపురం గ్రామంలో డ్రైనేజీ నిర్మాన పనులు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకుని డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. అలాగే భరించరాని దుర్వాసనతో స్థానికులు నానాపాట్లు పడేవారు. దీంతో ఈ సమస్యను టీడీపీ నాయకుడు అప్పలరాజు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన నిధులు మంజూరు చేయడంతో మెయిన్ రోడ్డుకు అనుకుని సుమారు 350 మీటర్ల పొడవున డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని అప్పలరాజు తెలిపారు. డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయితే మురుగు నీటి సమస్య ఉండదని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బ్యాంటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చింతకాయల విజయ్

ప్రీమియం లీగ్ టీ20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

నర్సీపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శివపురం జూనియర్ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌ను టీడీపీ యువ నాయకుడు చింతకాయల విజయ్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా కొబ్బరికాయ కొట్టి పిచ్‌ను ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి తొలి బంతికి బ్యాటింగ్ చేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో ఇదే క్రీడా మైదానంలో 110 టీమ్‌లతో డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంటును నిర్వహించామని గుర్తు చేశారు. యువత ఆటలు, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయని విజయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దనిమిరెడ్డి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాతవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.భవానీ తెలిపారు. బైపీసీలో 40 సీట్లు భర్తీ కావాల్సి ఉందన్నారు. అలాగే 6వ తరగతిలో ప్రవేశానికి 40 సీట్లు, 7,8,9,10 తరగతుల్లో మిగుల సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బడి బయట పిల్లలు, అనాథ చిన్నారులు, ఓసీ, బీసీ ఎస్సీ, మైనారిటీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించడం జరుగుతుందని భవానీ స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో పాటు కేజీబీవీ నోటీసు బోర్డులో లిస్టు పెట్టడం జరుగుతందన్నారు. మరిన్ని వివరాలకు 9666801458, 9505455172 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

బస్సు షెల్టర్లు శుభ్రం: ప్రయాణికుల హర్షం



ఎ.అగ్రహారంలో బస్సు షెల్టర్‌కు రంగులు వేసేందుకు శుభ్రం చేస్తున్న దృశ్యం

నాతవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రతో పాటు నాతవరం పంచాయతీ శివారు ఎ.అగ్రహారం గ్రామాల్లోని బస్సు షెల్టర్లను శుభ్రం చేసి రంగులు వేయడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఎంతోకాలంగా బస్సు షెల్టర్లకు సున్నం వేయకుండా వదలివేయడంతో పాడుపడిన భవనాల్లా కనిపించడమే కాకుండా అందులో కూర్చునేందుకు కూడా ఇబ్బందికరంగా ఉండేవి. అయితే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు పంచాయతీ నిధులతో నాతవరం, ఎ.అగ్రహారం బస్సు షెల్టర్లను శుభ్రం చేయడంతో పాటు రంగులు వేసేందుకు చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చినపాచిలలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ శంకరరావు

రావికమతం, మార్చి 30, (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వ దినం పురష్కరించుకోని మండలంలో చినపాచిలలో ఎన్టీఆర్ దిమ్మె వద్ద తెలుగు తమ్ముళ్ళు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఆ గ్రామ ఉపసర్పంచ్ కోమటి శంకరావు ఆదివారం ప్రారంభించారు. ఎన్టీఆర్ దిమ్మె రావికమతం- కింతలి, కొమిర రహదారులను అనుకోని ఉంటుంది. రహదారుల్లో నిత్యం ప్రయాణికులు రద్దీ ఉంటుంది. ఈ చలివేంద్రం ఈ రహదారుల నుంచే వెళ్లే ప్రయాణికులతో పాటు, ఎన్టీఆర్ దిమ్మె వద్ద రోజూ వందల సంఖ్యలో వేప చెట్టు కింద సేద తీరే వారికి ఈ చలివేంద్రం దాహర్తిని తీర్చేందుకు తెలుగు తమ్ముళ్ల ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప సర్పంచ్ శంకరావు కోనియాడారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ఆడాడ రాజారావు, టీడీపీ సినీయర్ నాయకులు సాసుబిల్లి రాజేశ్వరావు, ముమ్మిన ప్రసాద్, నక్కా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో



గాయపడిన ఈశ్వరమ్మ

దేవరాపల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి)మండలంలోని వాకపల్లి మెట్ట వై.జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరుకు తీవ్ర గాయాలు తగిలాయి. ఈప్రమాదంలో ఐదేళ్ల బాలుడు పట్నాల భార్గవ్ కాలు విరిగింది. గొండి ఈశ్వరమ్మ (40)తలకు బలమైన గాయమయింది. చీడికాడ నుంచి ఐదుగురు ఆటోలో వస్తున్నారు. వై.జంక్షన్ వద్ద ప్రమాదకరమైన మలుపులో ఆటో విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఇద్దరుకు గాయాలు తగలడంతో 108లో కె.కోటపాడు తరలించినట్లు గాయ పడిన వారి బందువులు తెలిపారు.

ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో చోరీ

రూ.2 లక్షల బంగారు ఆభరణాల అపహరణ

దేవరాపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన నందిపల్లి ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో చోరులు పడ్డారు. శుక్రవారం రాత్రి గేటును పెకిలించి ఆలయ గుడిలోకి చొరబడ్డారు. అమ్మవారి కిలో వెండి కిరీటం, చేతులకు అమర్చిన వెండి కవచాలతో పాటు అమ్మ వారి మెడలో ఉన్న బంగారు మంగళ సూత్రాలు, పావుతులం ముక్కు పుడక, చోరీ చేశారు. అపహరణకు గురైన ఆభరణాలు విలువ సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని గ్రామస్థులు పోతల రఘు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఆలయం ఉండడంతో దొంగతనం జరిగిన విషయాన్ని అధికారులకు చేర వేశారు. దీంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లేశ్వరరావు క్లూస్‌టీంతో అక్కడకు చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఊరూరా ఉగాది సందడి

చినపాచిల రచ్చబండ వద్ద సంప్రదాయబద్ధంగా పంచాంగ శ్రవణం

రావికమతం, మార్చి30, (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని గ్రామగ్రామాన ఆదివారం కొత్త సంవత్సరం వేడుకుల సందడి కనిపించింది. సంప్రదాయ వస్త్రధారణతో ఉదయం నుంచి ఆలయాలకు వెళ్లడం, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం, సాయంత్రంపంచాంగ శ్రవణం వంటి వాటితో పల్లెలు సందడిగా కనిపించాయి. ఈ సందర్భంగా చినపాచిల రచ్చబండ (పెద్దరాయి) వద్ద, కొమిర రామాలయం వద్ద, రావికమతం, శివాలయం, కంచిపాటివారి, గంజివారి దేవాలయాలల్లో, కొత్తకోట శికేశవ ఆలయం, టి.అర్జాపురం వినాయక ఆలయం, గొంప, మరుపాక, మేడివాడ, దొండపూడి, గుమ్మాళ్ళపాడు, గుడ్డిప, తట్టబంద, తోటకూరపాలెం తదితర గ్రామాల్లో ఆయా గ్రామ రామాలయాల్లోనూ సందడిగా పంచాంగ శ్రవణం కార్యక్రమాలను ఆయా గ్రామ పురోహితులు, వేద పండితులు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో జన్మనక్షత్ర, పేరు బలం, రాశి ఫలాలు రాణింపు, ఆదాయం, వ్యయం, రాజ్యపూజ్యం, రాజకీయపార్టీల బలాబలాలు, అభివృద్ధి, ఆనందం, వ్యాపారలావాదేవీలు, వాతావరణం, పాడిపంటలు, ఉద్యోగ అవకాశాలపైన పేరు పేరునా ఒక్కొక్కరికి పంచాంగకర్తలు వివరించారు. అలాగే వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలు, పశుసంపద ఇలా అన్ని బాగానే ఉంటుందని పండితులు తెలిపారు. చినపాచిల రచ్చబండ వద్ద ఆరవెల్లి వెంకటరామ గాపాలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణానికి పెద్ద ఎత్తున గ్రామస్థులు హాజరయ్యారు. ఈ గ్రామంలో ప్రత్యేకంగా నిర్వహించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా ఒకే చోట పంచాంగ శ్రవణం నిర్వహించారు ప్రతి ఏటా ఈ విధంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ గ్రామంలో ఉగాది రోజున రచ్చ బండ వద్ద నిర్వహించే పంచాగ శ్రవణమే ఓ సెంటుమెంటుగా గ్రామస్థులంతా భావించి భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంటి నుంచి హాజరయ్యారు. దీంతో పంచాంగ శ్రవణ మండప కళకళలాడింది.



చినపాచిల రచ్చబండ వద్ద భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్థులు

చోడవరంలో..

చోడవరం : పట్టణంలో ఉగాది వేడుకలు ఘనంగాసంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా పట్టణంలోని ఆలయాలు తెల్లవారి నుంచి భక్తులతో రద్దీగా మారాయి. తెలుగు సంవత్సరాది కావడంతో భక్తులు సంప్రదాయ వస్త్రధారణంలో ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక ప్రేమసమాజంలో సంస్కారభారతి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏడమ్స్ స్కూల్ డైరెక్టర్ బి. వెంకటరావు ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రధారణతో ఆడపిల్లలకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. సంస్కారభారతి అధ్యక్షుడు ఏ ఆర్‌జీ శర్మ ఆధ్వర్యంలో తెలుగు కవితలు, పద్యాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ ప్రసాద్, ప్రేమసమాజం రాజు, పి.సూర్యప్రకాశ్, బి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులోని వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాంగ శ్రవణంతో పాటు, తెలుగు పాటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : స్థానిక రామాలయంలో ఉగాధి పంచాంగ శ్రవణం ఆదివారం నిర్వహించారు. గ్రామస్తులంతా పాల్గొన్నారు. పురోహితులు మాట్లాడిన అనంతరం గ్రా మంలో గ్రామ దేవతలు ఆల యాలు అభివృద్ధి, ఆలయాలకు రోడ్లు లేవని, అలాగే రైతులు పం డించే కూర కాయలు కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరా రు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మహేశ్వరీనాయుడు, వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కె.వీరమణ, లలితానాయుడు, పరవాడ రవి, రాంబాబు, గండిపడాల అప్పలరాజు పురోహితులు లక్ష్మీపతి పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ దీక్ష

- విజయరామరాజుపేట గ్రామస్థుల ఆందోళన

బుచ్చెయ్యపేట,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విజయ రామరాజుపేటలో మద్యం దుకాణం తెరవవద్దు, మద్యం అమ్మవద్దంటూ గ్రామపెద్దలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామంలో విద్యాలయాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణంఅనుమతిని రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని నిరసిస్తూ దళిత కాలనీలో టెంటు వేసి నిరాహారదీక్ష చేపట్టారు. ఆదివారం మద్యం దుకాణం ప్రారంభించడాన్ని డ్వాక్రా సంఘాలు, దళిత సంఘాలు అడ్డుకున్నాయి. అయి నప్పటికీ షాపు యజమాని ప్రారంభోత్సవాన్ని ఆపలేదు. దీంతో దళిత కాలనీలో టెంటు వేసి నిరాహారదీక్ష చేపట్టారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా సమష్టిగా తీర్మానించుకొని మద్యం దుకాణం తెరవ వద్దని తెలిపినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్ వాడీ పక్కన షాపు ప్రారంభించడం చాలా దారుణ మని పక్క గ్రామమైన మంగళాపురం, విజయరామరాజుపేట గ్రామాలనుంచి చదువుతున్న విద్యార్థులు ట్యూషన్‌కి వెళ్లి అటుగా వస్తారని, బతుకు రీత్యా అధిస్థాన్ (బ్రాండెక్స్)కు వెళ్లిన మహిళలు రాత్రి 12 గంట ల సమయంలో అదేమార్గంలో రాకపోకలు సాగి స్తుంటారని, వారికి మద్యంబాబుల బెడద తప్పదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో మద్యం దుకాణం తెరవకుండా అధి కారులు చర్యలు తీసుకోవాలనినిరాహారదీక్ష ప్రారంభించారు. ఈ దీక్షకు గ్రామ సర్పంచ్ యల్లపు విజయకుమార్, ఎంపీటీసీ బాలకృష్ణ, వైస్‌సర్పంచ్ దొడ్డి జగన్నాథం, మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, కర్రి తమ్మునాయుడు, అంబే ద్కర్ యువజన సేవాసంఘం, డ్వాక్రా సంఘాలు పాల్గొన్నాయి.



మద్యం దుకాణం నిర్వాహకుడితో నిరసనకారుల వాగ్వాదం

శ్రీనూకాంబిక అమ్మవారి పాదుకల ఊరేగింపు

రావికమతం, మార్చి 30, (ఆంధ్రజ్యోతి) : మేడివాడ శ్రీ నూకాంబిక అమ్మవారి పాదుకలను గ్రామ పురవీధుల్లో ఆదివారం ఘనంగా ఊరేగించారు. ఆ గ్రామానికి చెందిన గొల్లవిల్లి వారి పొలాల సమీపంలో పూర్వపు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయం రావి వారి వంశీకుల ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ మేరకు రావివారి ఆడపడుచు కోటపాడుకు చెందిన మజ్జి శ్రీను, కాసమ్మ దంపతులు అమ్మవారికి రూ.25లతో నూతనంగా తయారు చేసిన పాదుకలు (అమ్మవారి పాదాలు)ను విరాళంగా అందజేశారు. ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించిన అనంతరం శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటికి అందజేశారు.

కేజేపురం జంక్షన్‌లో వీహెచ్‌పీ సమ్మేళనం

మాడుగుల రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజేపురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ సమ్మేళనాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీడీ నాయుడు, ప్రదీప్ శర్మ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, సోమన్నదొర, చిరంజీవినాయుడు, దేముళ్లు, కొండలరావు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీ రమేశ్ చొరవతో రోడ్డు పనులు

- చోడవరం జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు



అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో సమావేశమైన రాజు

చోడవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలంగా నిలిచిపోయిన చోడవరం - వడ్డాది బీఎన్ రోడ్డు పనులు ఏప్రిల్ 10 నుంచి ప్రారంభం కానున్నాయని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు తెలిపారు. బీఎన్ రోడ్డు నిర్మాణం ఆగిపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ దృష్టికి ఆదివారం కలిసి తీసుకెళ్లినట్టు చెప్పారు. దీనిపై స్పందించిన ఎంపీ ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో రోడ్డు కాంట్రాక్టర్‌తో చర్చించి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఎంపీ ఆదేశాల మేరకు ఏప్రిల్ 10 నుంచి పనులు ప్రారంభించడానికి కాంట్రాక్టర్ అంగీకరించారని రాజు తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా మారిన వడ్డాది, చోడవరం, వెంకన్నపాలెం, గంధవరం రోడ్డు పనులు ప్రారంభానికి చర్యలు తీసుకున్న ఎంపీకి జనసేన ఇన్‌చార్జి కృతజ్ఞతలు తెలిపారు. బీఎన్ రోడ్డు పనులు ప్రారంభానికి అడుగులు పడటంతో త్వరలో ప్రజల రహదారి కష్టాలు తీరుతాయని పీవీఎస్‌ఎన్ రాజు పేర్కొన్నారు.

6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గూడెంకొత్తవీధి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏప్రిల్ 6 నుంచి నాలుగు రోజుల పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉత్సవ పోస్టర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు రీమల రాజేశ్వరి, నాగమణి, మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్, జనసేన నాయకుడు గొర్లె వీరవెంకట్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు రీమలపాల్, సుకత్తి లక్ష్మణ్, మృధుభాషిణి, గొర్లె కళావతి, వెంకటరావు, మహేశ్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర విజయవంతానికి సహకరించాలి



విరాళాలు సేకరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతర విజయవంతానికి గ్రామస్థులు సహకరించాలని ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దురియా హేమంత్ కుమార్, పసుపులేటి వినాయక రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జాతర నిర్వాహణకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి 27 వరకు అమ్మవారి జాతర నిర్వహించనున్నట్టు చెప్పారు. నాలుగు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారుల సహకారంతో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి పోతురాజు బాలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, సభ్యులు సుర్ల వీరేంద్ర కుమార్, తాటిపాకల రమేశ్, నాగేశ్వరరావు, వర్తకసంఘం అధ్యక్షుడు జోగేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణులు రమేశ్

చింతపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆర్క్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రత్యేక ఈ శిబిరంలో వైద్యనిపుణులు బుక్కా రమేశ్ రోగులకు తనిఖీలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరమైన 11మంది గిరిజనులకు ప్రత్యేక వాహనంలో మైదాన ప్రాంతానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. వీరికి ఉచిత శస్త్రచికిత్స, భోజన, వసతి కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కంటి అద్దాలు అవసరమైన బాధితులకు నామమాత్రపు ధరకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దేశగిరి పుష్కరరావు, గ్రామ యువత పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఠారెత్తించింది. తర్వాత 3 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా వర్షం పడింది. పనసపుట్టు పంచాయతీ లుక్కూరు గ్రామంలో ఒక ఇంటిపై సాయంత్రం పిడుగు పడింది. దీంతో ఇంట్లో విద్యుత్ మీ టరు, వైర్లు, టీవీ, ఫ్యాన్లు, పలు సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.80 వేలు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. పిడుగు పడిన సమయంలో ఇట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీ వర్షంతో వాగులు , వంకలు వరదనీటితో ఉధృతంగా ప్రవహించాయి. పలు చోట్ల ప్రధాన రహదారులపైకి వచ్చింది. కొద్దిరోజులుగా ఎండ వేడికి విలవిలలాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఈ వర్షానికి జీడి, మామిడి పంటలు దెబ్బతింటాయని రైతులుదిగాలు చెందుతున్నారు.

వాడవాడలా ఉగాది వేడుకలు

పాడేరురూరల్, మార్చి 30 (ఆం ధ్రజ్యోతి): పట్టణంలో శైవక్షేత్రం శ్రీఉమానీకంఠేశ్వరస్వామీ వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఉగాది వేడుకలను ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన భగవద్గీత శ్లోక, తదితర పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులందించారు. వేద పండితులను ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్నారులసాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, దెశిది బాబూరావు, వంతినిభ రాజబాబు, ఉప్పలవెంకటరత్నం, చీపురు రమాదేవి, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు, మహిళా బృంద సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రం ముత్యాలమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసింది. ప్రాంగణంలో అర్చకుడు జగన్ పంచంగ శ్రవణం చేశారు. విశ్వవసునామ సంవత్సరం రాశి ఫలాల ఆధారంగా ఆదాయ, వ్యయాలను భక్తులకు తెలియజేశారు. ఈ ఏడాది వ్యవసాయానికి



చింతపల్లి: పంచాంగ శ్రవణంలో భక్తులు



పాడేరులో నిర్వహించిన పంచాంగశ్రవణలో పాల్గొన్న పండితులు, పెద్దలు

అత్యంత అనుకూలమని వివరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలకు కర్రీలాట, ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదిరెడ్ల బేతాళుడు, సుర్ల వీరేంద్ర కుమార్, తాటిపాకలు రమేశ్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పంచాంగ శ్రవణం

కొయ్యూరు: విశ్వహిందూ పరిషత్, సమరసత సేవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ల ఆధ్వర్యంలో డి. పద్మరాజు, డీవీడీ ప్రసాద్ ఈరే మల్లిబాబు, సమరసత సేవ ఫౌండేషన్ నుంచి సన్యాసిరావు, తదితరులు హాజరై కొత్త సంవత్సరాది విశిష్టను వివరించారు. అనంతరం ఉగాది పచ్చడిని ఆయా పంచాయతీల సర్పంచ్‌ల చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమాలలో వేద పం డితులు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో విశ్వహిందూ పరిషత్, వీహెచ్‌పీ మందిర అర్చక పురోహితులు, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యమే ధ్యేయం



లింగాపురంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మారుమూల కొండలపై గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచి డోలీ మోతలు నివారణతే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నట్టు తెలుగుదేశం పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు బో నంగి సత్యవతి పేర్కొన్నారు. ఉగాది పురస్కరించుకుని మండలంలో చిట్టింపాడు పంచాయతీ లింగాపురం గ్రామానికి మూడున్నర కిలోమీటర్లు మేర రూ. 3. 50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు సత్యవతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల తరబడి కనీస రహదారికి నోచుకోని లింగాపురానికి తెలుగు దేశం పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డ ఈశ్వరి చొరవతో బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఇలానే రహదారి సౌకర్యం లేని కొండలపై గల మరిన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు ఈశ్వరి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు రామ్మూర్తి, సీలాపు సూరిబాబు, గాంధీతో పాటు కూటమి నేతలు తోట దొరబాబు, మాజీ సర్పంచ్ పాడి దొరబాబు, బూత్ ఇన్‌చార్జి కొండలరావు, దేవి, వెంకటేష్, జగన్, కుమార్, సన్యాసిరావు, సతీశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి'



పాడేరు పట్టణంలో భారీ చేపట్టిన క్రైస్తవ సోదరులు

పాడేరురూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సమీపంలోని కొంతమూరులో ఈ నెల 24వ తేదీ రాత్రి పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానా స్పద మృతిపై ప్రభుత్వం నిష్పక్షికంగా దర్యాప్తు చేపట్టాలని క్రైస్తవ సంఘం నాయకులు రీమాలి జాన్, ఎం.బాబూరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (యూసీవైఎం)సంయుక్త ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం అ పాడేరులో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పాస్టర్ అనుమానాస్పద మృతి ఘటనపై నెలకొన్న పలు అనుమానాలు నెలకొన్నాయన్నారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టి కొవ్వొత్తుల ప్రదర్శన ద్వారా ప్రవీణ్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాల్మన్‌రాజు, ఎం.డానియల్, బిషప్ దైవకృప చిక్కాల, పాస్టర్స్ పి.ఫ్రెడ్రిక్, వైవై.రత్నం, జి.తిమోతి, వి.మత్స్యరాజు, ఎస్.అబ్రహం, పి.కృపావరం, జి.రామారావు, పి.డేవిడ్, బి.ఎలీషారావు, కె.భాస్కరరావు, కె.సత్యారావు, కె.సుజిత్ పాల్గొన్నారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనంతగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికను రద్దు చేసినట్టు ఎంపీడీవో ఏవీవీ.కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రంజాన్ సెలవు కావడంతో రద్దు చేసినట్టు ఆయన వివరించారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

కిటకిటలాడిన ధారాలమ్మ ఆలయం



అలంకరణలో అమ్మవారు

సీలేరు, మార్చి 30 , (ఆంధ్రజ్యోతి) : ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ప్రధాన పండగ పూర్తయిన అనంతరం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు మహా నైవేద్యం అనంతరంతలుపులు మూసి వేశారు. ఆదివారం ఉదయం తిరిగి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పండగతోపాటు ఉగాది పర్వదినం కావడంతో ఉభయ గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలోవచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ, ఆలయ ఈవో సాంబశివరావు ఆధ్వర్యం లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందరికి దర్శనం కలిగే చర్యలు తీసుకున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

'అబ్రహం టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం తగదు'



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టిబాబురావు, నేతలు

అరకులోయ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థిపై రెబల్‌గా పోటీ చేసి సస్పెన్షన్‌కు లోనైన సీవేరి అబ్రహం పార్టీకి సంబంధం లేకుండా గ్రామాల్లో పలు కార్యకలాపాల్లో పాల్గొవడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పార్టీ ప్రధాన కార్యదర్శి లకోయ్ మహాదేవ్, పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబు తదితరులు హితవు పలికారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉండొద్దని ఎన్నికల్లో వారించినా అ బ్రహం వినలేదన్నారు. తన ఇష్టానుసారంగా పార్టీకి వెన్నుపోటుపొడిచి రెబల్ అభ్యర్థిగా నిలిచారన్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చేసరికి పార్టీ కార్యకలాపాల్లో గ్రామాల్లో పాల్గొనడం సరికాదన్నారు. అయనపై అధిష్ఠానం సస్పెన్షన్‌ను ఇంకా సడలించలేదన్న విషయాన్ని గమనించాలన్నారు. సస్పెండ్ అయిన ఆయన ఇకపై పార్టీకార్యకలాపాల్లో పాల్గొంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన పార్టీలోకి వచ్చినా తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో సాగర పంచాయతీ సర్పంచ్ కొర్రా సీతారాం, నియోజకవర్గ మహిళా నాయకురాలు ఎల్‌బీ కళావతి, బూత్ యునిట్ ఇన్‌చార్జి ఎల్‌బీ చిన్న, పాంగి రాజు. వంతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శివలింగం ప్రతిష్ఠ



శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠిస్తున్న సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ నగర్ సమీప పంచముఖ ఆంజనే య ఆలయ ప్రాంగంణంలో శివలింగాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఉగాది పురస్కరించుకుని సాయిరాం స్వామిజీ వేద మంత్రాలతో ఈ కార్యక్రమం పూర్తి చేశారు. పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిముడు రాంబాబు, నిర్వహకులు ఎం.మత్స్యరాజు, వడ్డాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడేరు ఘాట్‌లో కూలిన వృక్షం .. ప్రయాణికుల అవస్థలు



రోడ్డు మధ్యన నేలకొరిగిన భారీ వృక్షం

పాడేరురూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్ మార్గంలోని పాడేరు- విశాఖ ప్రధాన రహదారిలో వంట్లమామిడి గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 12 గంటల సమయంలో భారీ వృక్షం నేలకొరగడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వంట్లమామిడి సమీపంలోని మలుపు వద్ద ఆకస్మికంగా పక్కనే ఉన్న కొండనుంచి భారీ వృక్షం ప్రధాన రహదారికి అడ్డంగా పడిపోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామస్థులు వెంటనే అక్కడికి సమీపంలో కొత్త విద్యుత్ పోల్స్ వేస్తున్న సిబ్బందికి విషయం తెలియజేశారు. వారి వద్దనున్న చెట్లు కోత మిషన్‌తో గ్రామస్తుల సహకారంతో వృక్షాన్ని తొలగించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పాడేరు ఘాట్ మార్గంలో కూలిపోయే స్థితిలో ఉన్న భారీ వృక్షాలను గుర్తించి వాటిని ముందుగా తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో గిరిజన బాలిక ప్రతిభ

పాడేరురూరల్, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్- 2025 పోటీల అండర్-14 విభాగంలో మండలంలోని తుంపాడకు చెందిన మినుముల శ్రీనివాస్ పాత్రుడు, నాగమణి గిరిజన దంపతుల కుమార్తె నాగసాయి తన్మయశ్రీ (13) ప్రతిభ చూపారు. స్థానిక సెయింటాన్స్ స్కూల్లో ఎనిదో తరగతి చదువుతున్న ఆమె ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభను కనపరిచి, ఈనెల 6వ తేదీ నుంచి మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు స్థానిక కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎగ్జామినార్ బాకూరు పాండురాజు తెలిపారు.

టీచర్ల బదిలీలపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం చెక్ పెడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం -2025 రూపొందించి అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఉపాధ్యాయుల బదిలీల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ప్రతి ఏడాది మే నెల 31 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేసి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టేలా చట్టాన్ని రూపొందించారు. కొత్త చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పేటలో చిలకల తీర్థం సందడి

... 5వ పేజీ తరువాయి

పంచదార చిలకలు, రంగుల చేటలు, ఆట వస్తువులు, తినుబండారాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. తీర్థం సందర్భంగా పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పాయకరావుపేట, నక్కపల్లి సీఐలు జి.అప్పన్న, రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతోపాటు సుమారు 80 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేషన్ కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ గడువు పెంపు

... 5వ పేజీ తరువాయి

చేయించాలని సీఎస్‌డీటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ తప్పనిసరి

రేషన్ కార్డు లబ్ధిదారుల్లో ఐదేళ్లు నిండిన పిల్లల దగ్గర నుంచి ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకోవల్సి ఉంది. ఐదేళ్లు దాటిన పిల్లల బయోమెట్రిక్ పడకపోతే ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేయించుకొని డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.

నేడు మంత్రి లోకేశ్ పర్యటన

... 5వ పేజీ తరువాయి

ముందు వరుసలో నిలిచిన కార్యకర్తలతో లోకేశ్ భేటీ అవుతారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు రూ.246 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఫ్లైఓవర్, రోడ్డు పనులశంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అచ్యుతాపురంలోని మోసయ్యపేట కూడలిలో ఫ్లైఓవర్ పనులు, అనకాపల్లి వరకు సుమారు 13.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డు పనులకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకురోడ్డుమార్గంలోఆయనబయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

ఢిల్లీ డబుల్ ధమాకా

... 5వ పేజీ తరువాయి

ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి వరుసగా రెండో విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి ఓవర్‌లోనే రనౌట్ అయ్యాడు. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఇషాన్ కిషన్(2) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేదు. అతడి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన లోకల్‌బాయ్ నితీశ్‌కుమార్ రెడ్డి కేవలం రెండు బంతులను ఎదుర్కొని చెత్త షాట్‌తో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరాడు. వ్యక్తిగత ఎనిమిది పరుగుల వద్ద అక్షర పటేల్ బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న అనికేత్ వర్మ ఆ తరువాత చెలరేగి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. కేవలం 34 బంతుల్లో నాలుగు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ(50) పూర్తిచేసిన అనికేత్‌వర్మకు క్లాసెన్ (32) తోడవడంతో ఎస్ఆర్‌హెచ్ శిబిరం ఊపిరిపీల్చుకుంది. జోరుమీదున్న అనికేత్ వర్మ(74) కులదీప్ యాదవ్ బౌలింగ్‌లో మెక్‌గుర్క్ పట్టిన అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. తర్వాత స్థానాలో దిగిన బ్యాట్స్‌మన్లను మిచెల్ స్టార్క్ వరుసగా పెవిలియన్ దారి పట్టించాడు.

సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్ మెక్ గుర్క్ (38) సమయస్ఫూర్తితో ఆడగా, మరో ఓపెనర్ డుప్లెసిస్ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించాడు. అర్ధ సెంచరీ చేసిన డుప్లెసిస్ అన్సారీ బౌలింగ్‌లో తొలి వికెట్‌గా అవుటవ్వగా తర్వాత స్థానంలో దిగిన అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) ఎస్ఆర్‌హెచ్ బౌలర్లను చెండాడి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఈ మ్యాచ్‌లో జట్టులో చేరిన కేఎల్ రాహుల్ (15) అన్సారీ బౌలింగ్‌లో మూడో వికెట్‌గా పెవిలియన్‌కు చేరగా, రాహుల్ స్థానంలో వచ్చిన స్టబ్స్ (21 నాటౌట్, 3 ఫోర్లతో) మ్యాచ్‌ను ముగించాడు.

విశాఖలో ఐపీఎల్ జోష్

మధురవాడలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 18. 4 ఓవర్లకు 163 పరుగులు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, ఇక్కడ రెండో విజయాన్ని నమోదు చేసింది.



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఏసీఏ ప్రతినిధులు



ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, హోం మంత్రి అనిత



క్యాచ్ పడుతున్న జాక్ ఫ్రేజర్



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో స్టార్క్



ప్రేక్షకులతో నిండిన స్టేడియం



క్లాసెన్ బ్యాటింగ్



మహ్మద్ షమీ



వికెట్ తీసిన ఆనందంలో మిచెల్ స్టార్క్



వికెట్ తీసిన ఆనందంలో ఢిల్లీ జట్టు ఆటగాళ్లు



కేఎల్ రాహుల్

ఘనంగా నవ వసంత వేడుక

- కలెక్టర్ ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఆలయం ఆవరణలో నిర్వహణ
- ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి వంగలపూడి అనిత
- విశ్వావసు నామ సంవత్సరం ఉగాది విశిష్టతను వివరించిన వేద పండితులు



ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, చిత్రంలో కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితరులు

అనకాపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఇక్కడి నూకాంబిక అమ్మవారి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక జగన్నాథస్వామి ఆలయ పండితులు బంకుపల్లి సత్యనారాయణ పంచాంగ శ్రవణం జరిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఇందుకు నూకాంబిక ఆశీస్సులు కలగజేయాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు వాటిని వారసత్వంగా అందించాలని ఆమె కోరారు. మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారం ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు రాంబిల్లి విశ్వంబరస్వామి, బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి గ్రామ రామలింగేశ్వర స్వామి ఆలయ అర్చకులు దంతుకుర్తి సన్యాసిరావు, మాడుగుల మండలం కోడూరు గ్రామం రామాలయం లక్ష్మీనారాయణస్వామి ఆలయ అర్చకులు పెద్దింటి రాంబాబు, రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామ వల్లభ నారాయణ స్వామి ఆలయ అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులను ఈ సందర్భంగా హోం మంత్రి , కలెక్టర్, జేసీ, ఎస్పీ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా ఇన్‌చార్జి పర్యాటక అధికారి రమామణి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారిణి కె.శోభారాణి, ఆలయ ఈవో వెంపలి రాంబాబు, దేవదాయశాఖ జిల్లా అధికారిణి సుధారాణి, ఉత్సవ కమిటీ సభ్యులు సూరే సతీష్, దాడి రవికుమార్, మారిశెట్టి శంకరరావు, ఆనంద్, శ్రీనివాసరావు, శ్రీకాంత్, కాండ్రేగుల రాజారావు, యఱ్ఱవరపు లక్ష్మి, సూర్యలక్ష్మి, మంగ, అర్చకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతరో.. జాతర

- నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హోం మంత్రి అనిత పూజలు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు

అనకాపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలువురు ప్రజా ప్రతినిధులు రావడంతో మరింత కోలాహలం నెలకొంది. తెల్లవారుజాము ఐదు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులు వేర్వేరు సమయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. డిప్యూటీ స్పీకర్, మంత్రి ఎమ్మెల్యేలు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయానికి వచ్చిన డిప్యూటీ స్పీకర్, హోం మంత్రిలకు కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి,ఈవో వెంపలి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలాలయంలోని అమ్మవారికి వీరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వీరికి ఆశీర్వాదం అందజేయగా, ఎమ్మెల్యే కొణతాల, చైర్మన్ పీలాలు సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వారిని సత్కరించారు. అలాగే జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీలతో పాటు కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలావుంటే, నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం భక్తులతో కిటకిటలాడింది. వేడుకల్లో భాగంగా నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొని నూకాంబికను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.తాకాశీవీధి అమ్మవారి ఆలయంలో..

ఇక్కడి తాకాశి వీధిలోని నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య జాతరను వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాశి రాజేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్‌లు ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కశింకోట : విశ్వావసు నామ సంవత్సర ఉగా దిని పురస్కరించుకొని ఇక్కడి నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. మహిళలు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో పాటు పలువురు కూటమి నాయకులు అమ్మ వారి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

సాలాపువానిపాలెం వద్ద లారీ బీభత్సం

- తప్పిన పెను ప్రమాదం

లంకెలపాలెం, మార్చి 30 : జాతీయ రహదారి సాలాపువానిపాలెం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓలారీ బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చి బస్ షెల్టర్‌ను ఢీకొట్టి ఓ ఇంటి వెనుక భాగం వైపు దూసుకుపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి మండలం కూండ్రం నుంచి స్టోన్ క్రషర్ డస్ట్ లోడుతో ఆటోనగర్ వెళుతుండగా ఈ ఘటన జరిగింది. పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన నాటకోత్సవాలు



ప్రదర్శనలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు

అనకాపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న నాటకోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. మూడో రోజు ఈ ప్రదర్శనలను బీఎం రెడ్డి, దాడి రత్నాకర్, వీవీ రమణమూర్తి, వెంకటేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను వీరు అభినందించారు. అనంతరం కళా కారులు ప్రదర్శించిన 'రేపటి శత్రువు', 'కొత్త సైన్యం' నాటికలు ప్రేక్షకులను మెప్పించాయి. కళాకారులు తమ అద్భుత నటనతో అందరి ప్రశంసలను అందుకున్నారు.

రైలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన డ్రైవరు మృతి

అనకాపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొన్న ప్రమాదంలో గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి (సీటీవో) కారు డ్రైవరు రాజు మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఈనెల 13న సీటీవోతో కలిసి డ్రైవర్ రాజు విశాఖపట్నంలోని రైల్వే స్టేషన్ ఎనిమిదో నెంబరు ప్లాట్‌ఫాం దాటుతుండగా, ప్రమాదవశాత్తు రైలు ఇంజన్ ఢీకొట్టింది. రాజు సీటీవో అద్దె కారుకు డ్రైవరుగా కొనసాగుతున్నారు. రైల్వే స్టేషన్‌లో జీఎస్‌టీ అధికారులు తనిఖీలు నిర్వహించే అవకాశం లేకపోయినా ప్రమాదం జరిగిన రోజు సీటీవో డ్రైవరు రాజును ఎందుకు రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారో తెలియడం లేదు. ప్రమాదం జరిగి గాయపడిన డ్రైవరు రాజు ప్రైవేటు కారు డ్రైవరు కావడంతో సీటీవో పట్టించుకోకుండా వదిలేశారని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదేరోజు విశాఖ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. తీవ్ర గాయాలపాలైన అతనిని కేజీహెచ్‌కు తరలించారు. 16రోజుల పాటు చికిత్స పొందుతున్న రాజు శనివారం సాయంత్రం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన తరువాత ఆదుకోవాల్సిన సీటీవో పట్టించుకోకుండా వదిలేయడం వల్ల రోడ్డున పడ్డామని అతని కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.